నాసిరకంగా రోడ్డు విస్తరణ పనులు

- స్థానికుల అభ్యంతరం.. సోషల్ మీడియాలో వైరల్
- పనులు నిలిపివేయించిన అధికారులు


పనులు నిలిపివేయిస్తున్న ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్


నిర్మాణానికి వినియోగిస్తున్న నాసిరకం ఇసుక

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పాలకుర్తి మండల కేంద్రం మీదుగా ఈసాలతక్కళ్లపల్లి గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. రూ.కోటి 60లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో రహదారి నిర్మాణ పనులు సాగుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ మండలంలోని పుట్నూర్, జయ్యారం గ్రామాల శివారులోని వాగుల నుంచి ఇసుక తీసుకొచ్చి నిర్మాణ పనులకు వినియోగించడాన్ని గమనించిన స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సంబంధిత విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడం, అది వైరల్ కావడంతో ఎంపీడీవో శశికళతో పాటు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు స్పందించారు. రహదారి నిర్మాణ పనులు నిర్వహిస్తున్న స్థలానికి వెళ్లి పనులు నిలిపివేయించారు. సంబంధిత కాంట్రాక్టర్ ప్రధాన రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా నిర్వహిస్తుంటే అధికారులు పర్యవేక్షించాలి. కానీ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకునే వరకు పట్టించుకోకపోవడం స్థానికంగా విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కళోత్సవాలకు ఎంపిక


అభినందిస్తున్న అధికారులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీ విశ్వభారతి పాఠశాల విద్యార్థి శివ నాగరాజు రాష్ట్రస్థాయి కళోత్సవాలకు ఎంపికయ్యాడు. జిల్లా కళోత్సవాల ఇన్‌చార్జి అధికారులు ఎండీ షేక్, జగదీష్ శనివారం శివ నాగరాజుకు ఎంపిక పత్రాన్ని అందించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి కళోత్సవాల్లో విశ్వభారతి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న శివనాగరాజు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రకటించారు. విద్యార్థిని విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అభినందించారు.

సెంట్రల్ డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని శివాజీనగర్, భరత్‌నగర్ కాలనీల్లో ఎట్టకేలకు సెంట్రల్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ నిర్మాణ స్థితిగతులను పరిశీలించి నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పొద్దుతిరుగుడు సాగుతో లాభాలు బాగు

ఓదెల: పొద్దు తిరుగుడు సాగు రైతులకు లాభాలు వస్తాయని ఓదెల వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. ఓదెల రైతువేదికలో శనివారం పూర్తి రాయితీతో పొద్దుతిరుగుడు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటమార్పిడిలో భాగంగా పొద్దుతిరుగుడు సాగువైపు ఉత్సాహంగా రైతులు సాగుచేయాలన్నారు. వంటనూనెల డిమాండు దృష్ట్యా నూనెగింజల సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఓదెల రైతువేదికలో విత్తనాలు తీసుకోవచ్చన్నారు. ఏఈవో సంధ్య పాల్గొన్నారు.

బాలికల జిమ్ ప్రారంభం



రామగిరి: సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూ కళాశాలలో శనివారం బాలికల జిమ్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. రూ.5లక్షల వ్యయంతో బాలికల హాస్టల్‌లో జిమ్ ఏర్పాటు చేశారు. త్వరలోనే బాలుర హాస్టల్‌లో జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవి కుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, పీడీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన మహాలక్ష్మి, హాసిని, లాస్యప్రియ ప్రతిభ ప్రదర్శించి ప్రశంస పత్రాలు అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు పీఈటీ స్రవంతిని అభినందించారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్ ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రామగుండం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024-25లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు పోటీ పడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.మోహన్, అధ్యాపకులు హాజరయ్యారు.

ఎన్టీపీసీ భూనిర్వాసితులకు బీఆర్ఎస్ అండ


మాట్లాడుతున్న చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థకు భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు నివాసంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు సంస్థ న్యాయం చేయడం లేదని ఆరోపించారు. భూనిర్వాసితులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈక్రమంలో సోమవారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వంటావార్పు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రమణారెడ్డి, నాయకులు బుర్ర శంకర్‌గౌడ్, దాసరి ఆనంద్, ఈదునూరి శంకర్ పాల్గొన్నారు.

కూలీలకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం మండలం బ్రాహ్మణపల్లిలో ట్రాక్టర్ బోల్తాపడి గాయపడిన కూలీలను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ శనివారం పరామర్శించారు. స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు చిలుక లక్ష్మి, కొండ్ర కొమురక్క, చిలుక సరిత, పబ్బ ఉమ, చిలుక రాజమణి, చిలుక శంకరమ్మను పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. నాయకులు బొంతల రాజేశ్, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాలు అధ్యక్షులు ఉన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్ పరామర్శ

రామగిరి: కల్వచర్లకు చెందిన జంగిలి అమృత, బుధవారంపేటకు చెందిన దేవునూరి విజయ్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను శనివారం జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోండి


రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి

రామగిరి: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతీ ఇంజనీరింగ్ విద్యార్థి ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు మాట్లాడుతూ మంథని జేఎన్టీయూ కళాశాలకు సింగరేణి సహకారం ఉంటుందన్నారు. కళాశాల యాజమాన్యం అతిథులను సన్మానించింది. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, రిజిస్ట్రార్ పీఏ భాస్కర్, కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరో నాలుగు క్వార్టర్ల కూల్చివేత

గోదావరిఖని: సింగరేణి క్వార్టర్ల కూల్చివేత కొనసాగుతోంది. శనివారం మరో నాలుగింటిని అధికారులు కూల్చివేశారు. రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతంపై సింగరేణి దృష్టి సారించింది. ప్రధాన చౌరస్తాకు సమీపంలో కాంగ్రెస్ నాయకుల అడ్డాగా ఉన్న వైట్‌హౌస్‌ను నేలమట్టం చేశారు. గత రెండు రోజుల్లో ఏడు క్వార్టర్లను తొలగించారు. కోర్టు కేసులో ఉన్న 26 క్వార్టర్లు మినహా మిగతా వాటిని త్వరలోనే ఖాళీ చేయించి కూల్చివేయాలని నిర్ణయించారు. ఈక్రమంలో కోర్టు కేసులో ఉన్న కార్మికులకు కూడా కోర్టు ఆదేశాల ప్రకారం క్వార్టర్లు కేటాయించి, వాటిని కూడా స్వాధీనం చేసుకుని రోడ్ల విస్తరణ ప్రక్రియ పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

ట్రినిటిలో ఫ్రెషర్స్ డే


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం డిప్లొమా ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మణిగణేశన్, సురేశ్, రాజిరెడ్డి, నటరాజన్, ప్రభాకర్, స్వాతి, వంశీకృష్ణ, రాజు, శ్రీనివాస్, శివకుమార్, అశోక్, రాజేందర్, మధుశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

పర్సనల్ డీజీఎంకు వినతి

రామగిరి: ఆర్జీ-3 ఏరియాలోని సింగరేణి కార్మికులకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా తాగునీరు అందించాలని శనివారం పర్సనల్ డీజీఎం బి.సుదర్శనానికి బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య వినతిపత్రం అందజేశారు. బీఎంఎస్ ఆయా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

పాలకుర్తి: గర్భిణులు, బాలింతలకు రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, వారు అధిక పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని రామగుండం సీడీపీవో అలేఖ్యపటేల్ సూచించారు. మండలంలోని బసంత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందజేశారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు

ధర్మారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ధర్మారం మండల అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ ఆశావహులు వంగ మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవి రమేశ్, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కోట శశిధర్, ముద్దసాని సతీశ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలో చికెన్ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాలకు సంబంధించిన టెండర్లలో మున్సిపల్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని నాగేందర్‌బాబు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. సీల్డ్ టెండర్‌లో రూ.9లక్షలకు వేసిన తనకు ఇవ్వకుండా గతంలో టెండర్ లేకుండానే అనధికారికంగా వ్యర్థాలను తీసుకెళ్లే వ్యక్తి రూ.5లక్షలకు టెండరు వేసినా అతనికే అప్పగించారన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని టెండర్ రద్దు చేయాలని కోరారు. అయితే నిబంధనల మేరకు సీల్డ్‌టెండర్ వేసిన వారికే అప్పగించామని, ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని కమిషనర్ వెంకటేశ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• ముమ్మరంగా బీజేపీ సభ్యత్వం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో బీజేపీ నాయకులు ముమ్మరంగా బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. యైటింక్లయిన్‌కాలనీ 19వ డివిజన్ పోతన కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ తదితర ఏరియాలలో శనివారం బీజేపీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్నారు. నియోజకవర్గ సభ్యత్వం ఇన్‌చార్జి సురేశ్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, శివాజీ, మూకిరి రాజు, దాసరి శ్రీనివాస్, ఆకుల శశికుమార్, దేవేందర్, పాషా, లింగం నాయక్, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

• గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, ఈసాలతక్కళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్ కేశోరాం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. కేశోరాం పర్మినెంట్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డితో కలిసి ప్లాంట్‌హెడ్ శ్రీనివాసరెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి రాతపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో సీఎస్సార్ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేయాలని కోరారు. తుంగ నర్సయ్య, సంకెళ్ల సత్యనారాయణ, బొంపెల్లి సత్తయ్య పాల్గొన్నారు.

• పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం దుస్తులు, బూట్లు, సబ్బులు పంపిణీ చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో భాస్కర్, కార్యదర్శి శంకర్, కారోబార్ భూమయ్య పాల్గొన్నారు.

• ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గోదావరిఖని ఐసీటీసీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు హెచ్ఐవీ, టీబీ గురించి తెలుసుకొని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్, స్వాతి, సింధూజ ఉన్నారు.

• కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఓదెల: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ కోరారు. ఓదెలలో ఏర్పాటు చేసిన శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు దళారుల బారిన పడకుండా అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

• విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పొలం దగ్ధం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేటలో శనివారం విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో రెండెకరాల వరిపొలం దగ్ధమైంది. గ్రామానికి చెందిన మాదాసు నరేందర్‌కు చెందిన ఎకరం, మహేందర్‌కు చెందిన ఎకరం వరిపొలం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. 11 కేవీ లైన్ కరెంట్ తీగలు గాలికి రాపిడికి గురై నిప్పురవ్వలు పంట పొలంపై పడి ప్రమాదం జరిగింది. ఇరుగు పొరుగు రైతులు వచ్చి మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. గతేడాది ఇదేవిధంగా ప్రమాదం సంభవించి సీడ్ వరిపంట దగ్ధమైనందని బాధిత రైతులు వాపోయారు. ప్రమాదంలో ఒక్కోరైతుకు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు స్థానిక రైతులు తెలిపారు.

• నాటిన మొక్కలను సంరక్షించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అన్నిగ్రామాల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షణ బాధ్యతలు స్వీకరించాలని ఎంపీడీవో ఎంఎ.అలీం ఆదేశించారు. మండలంలోని సోమనపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామశివారులో రైతులతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు ఉపయోగపడేందుకు ప్రభుత్వ భూముల్లో ఫాంపాండ్స్ తవ్వి అందులో నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్, కార్యదర్శి ఉన్నారు.

• ధర్మయుద్ధం మహాసభకు తరలిరావాలి

ధర్మారం: ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధర్మయుద్ధం మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం కోరారు. ధర్మారంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా నాయకులు పెర్క భానేష్, బొల్లి నందయ్య, సుంచు మల్లేశం, కల్లెపల్లి లింగయ్య, ఇరుగురావ నర్సయ్య పాల్గొన్నారు.

• మదర్ థెరిస్సాలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉపాధ్యాయ మెలకువలను కాలేజీ అధ్యాపకులకు వివరించారు. ఏవో పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శ్రీధర్, అనిల్, శశి, రమేశ్, షబానా, సంతోష్ ఉన్నారు.

• ప్లాస్టిక్ సామగ్రి ఏరుకునేవారిని అడ్డుకున్న పల్లెవాసులు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్ల తదితర ప్లాస్టిక్ సామగ్రి ఏరుకునేందుకు దూరం ప్రాంతం నుంచి వచ్చిన మహిళలను మల్లయ్యపల్లి వాసులు శనివారం అడ్డుకున్నారు. సామగ్రి ఏరుకునేందుకు రావొద్దని, తమ ఇళ్లలోని వస్తువులు చోరీకి గురవుతున్నాయని వాగ్వాదానికి దిగారు. నాలుగు రోజుల క్రితం కచ్చు సతీశ్‌కు చెందిన రూ.20వేలు విలువైన రెండు ఇత్తడి ఒగ్గుడోళ్లు చోరీకి గురైనట్లు స్థానికులు పేర్కొన్నారు. జూలపల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు చేరుకుని ప్లాస్టిక్ సామగ్రి ఏరుకునే వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



కమాన్‌పూర్: మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఓ ఫర్నీచర్ షాపు వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డు ప్రమాదకరంగా ఉంది. మండల కేంద్రం నుంచి వచ్చే వాహనాదారులకు మంథని-పెద్దపల్లి రహదారిపై వచ్చే వాహనాలు కనిపించడం లేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, ఇతర వాహనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీని పోలీసులు చొరవ తీసుకొని తొలగించాలని వాహనదారులు, ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కె. ప్రసాద్, ఎస్సై, కమాన్‌పూర్, సెల్ నం. : 87126 56523

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

తాగునీటి సమస్య పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

రామగిరి: ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని శనివారం జీఎం ఎన్.సుధాకర్‌రావుకు ఐఎన్‌టీయూసీ రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సెంటినరీకాలనీలో రెండు, మూడు రోజులకు ఒకసారి నల్లానీరు వస్తోందని, కొద్దిసేపు మాత్రమే నీరు రావడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. క్వార్టర్లలో నూతన పంపులు ఏర్పాటు చేయలని కోరారు. మూడు నెలలుగా సక్రమంగా తాగునీటి సరఫరా లేక కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. పాత బోర్ల స్థానంలో నూతన బోర్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఓసీపీ-1 గని 50ఏళ్ల పూర్తయినందున పీవో రాధాకృష్ణను శాలువాతో సన్మానించారు. రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు మర్రి ఓదెలు, బత్తుల రమేశ్, బ్రాంచ్ సెక్రటరీలు సాయికృష్ణ, బెల్లం శ్రీనివాస్, ఏపీఏ పిట్ సెక్రటరీ మండల కొమురయ్య, దుండె రాజేందర్, కాంగ్రెస్ నాయకులు వనం రాంచందర్‌రావు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో ముందుంటాం


కమిటీ పత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో టీబీజీకేఎస్ ముందుంటుందని ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ పేర్కొన్నారు. జీడీకే-2, 2ఏగని పిట్ కమిటీని శనివారం అధికారులకు పరిచయం చేశారు. గని సమస్యలపై అధికారులు సానుకూల ధోరణితో వ్యవహరించాలని కోరారు. యూనియన్ నాయకులు చెల్పూరి సతీశ్, దూట శేషగిరి, మీస రాజు, కళాధర్‌రెడ్డి, నరేశ్, తిరుపతి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్జీ-2లో క్వార్టర్ కౌన్సెలింగ్

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్ శనివారం యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. జీడీకే-11, ఓసీపీ-1 ఉద్యోగుల్లో ఇంతవరకు క్వార్టర్లు లేని ఉద్యోగులకు, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్వార్టర్ కౌన్సెలింగ్‌లో 490 క్వార్టర్స్‌కు గాను 276 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా ఇందులో 155 మంది హాజరయ్యారు. కాగా 127 మంది ఉద్యోగులు క్వార్టర్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఎస్.సంతోష్‌కుమార్, నాయకులు శ్యాంసన్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఎంఈటీలకు ఓవర్‌మెన్‌గా పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న జేఎంఈటీలకు ఓవర్‌మెన్లుగా పదోన్నతి కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు కోరారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడేళ్ల క్రితం సంస్థలో రిక్రూట్ అయిన వారిలో కొందరికి ఓవర్‌మెన్‌లుగా పదోన్నతి ఇచ్చారని, ఖాళీలు ఉన్నప్పటికీ మిలిగిన వారికి పదోన్నతి ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. సమయానికి రావాల్సిన ప్రమోషన్లు వెంటనే విడుదల చేయాలని, ఒకవేళ ఖాళీలు లేకపోతే వారికి రావాల్సిన గ్రేడ్ ప్రమోషన్ అయినా ఇవ్వాలని విన్నవించారు. దీనికి డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నర్సింహారావు తెలిపారు.

గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గం ఖరారు


ఎన్నికైన కార్యవర్గం

పెద్దపల్లిరూరల్: గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఖరారు చేశారు. ఐఎంఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తూము రవీందర్, అసోసియేట్ అధ్యక్షురాలిగా అలివేణి, ఉపాధ్యక్షులుగా కుమార్, సాజిద్‌అలీ, అంజలీ, కార్యదర్శిగా బ్రహ్మేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, మధు, అనూష, కోశాధికారిగా కరుణాకర్, నిర్వహణ, ప్రచార, కార్యాలయ, సాంస్కృతిక, క్రీడా కార్యదర్శులుగా సురేశ్, శ్రీకాంత్, శంకర్, తిరుమల్, మధుబాబుతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీరాంరెడ్డి, సహాయ అధికారిగా రామారావు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా టీఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు బొంకూరి శంకర్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

29న ఇసుక వేలం

కమాన్‌పూర్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్న ఇసుకను కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో 29న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వాసంతి శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా ధరావత్ చెల్లించాలని సూచించారు.

రామగుండం ఎస్సైకి సన్మానం

రామగుండం: ఇటీవల రామగుండం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గుండేటి సంధ్యారాణిని శనివారం స్థానిక కాంగ్రెస్ ప్రతినిధులు సన్మానించారు. కాంగ్రెస్ ప్రతినిధులు అప్పాసి శ్రీనివాస్, సిరిశెట్టి సతీశ్‌కుమార్ గౌడ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, గౌస్‌బాబా ఉన్నారు.